సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 31 । మార్చి । 2023



కేజీహెచ్‌లో పౌష్టికాహారం

కేజీహెచ్‌లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పోషకాలతో కూడిన ఆహారం అందించనున్నారు. 8లో



సిరులతల్లికి సహస్ర తులసిపూజ

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు.



పీఏసీ సభ్యుల పర్యటన

విశాఖ : వాల్తేరు డివిజన్‌లో రైల్వే ప్రయాణికుల సదుపాయాల కమిటీ (పీఏసీ) సభ్యుల పర్యటన గురువారం జరిగింది. 8లో



న్యూస్‌రీల్

వాకింగ్ ట్రాక్‌కు శ్రీకారం



ట్రాక్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి టౌన్: కొత్తూరు పంచాయతీలో ఎర్ర చెరువును సుందరీకరిస్తున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. పంచాయతీ పరిధిలో ఉన్న ఎర్రచెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ఆయన గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పచ్చదనం ఉట్టిపడేలా పార్కుతోపాటు 40 అడుగుల వాకింగ్ ట్రాక్ లారెస్ ల్యాబ్ సహకారంతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. చెరువును సుందరీకరించి ఆహ్లాదాన్ని పంచుతామన్నారు. మూడు మాసాల వ్యవధిలో ఈ ప్రాంతాన్ని సుందరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంతకుముందు 7.68 ఎకరాల చెరువు పరిసరాలను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లారెస్ ల్యాబ్ ప్రతినిధి నరసింగరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహాసత్యవతి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రం తరలింపు

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఏరువాక కేంద్రాన్ని కోనసీమ జిల్లా అమలాపురం ముమ్మిడివరానికి గురువారం తరలించారు. ఈ కేంద్రంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, మరో ముగ్గురు సిబ్బందిని బదిలీ చేశారు. ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించింది. అనకాపల్లి జిల్లాలో ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఏరువాక కేంద్రం, రాంబిల్లి మండలం హరిపురం కృషి విజ్ఞాన కేంద్రం, రావికమతం మండలం కొండెంపూడి కృషి విజ్ఞానకేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో మూడు కేంద్రాలుండడంతో ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఉన్న ఈ కేంద్రాన్ని అమలాపురానికి సిబ్బంది సహా బదిలీ చేశారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో సిబ్బంది విధులకు హాజరుకానున్నారు.

నేడు జాబ్ మేళా

విశాఖ: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధ తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. అరవిల యానిమల్ హెల్త్ లిమిటెడ్, మెడ్ ప్లస్ ఫార్మసీ, బీజేడీ 2050 హెల్త్‌కేర్ లిమిటెడ్, ఏటీసీ టైర్ ఏపీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, బీఫార్మసీ, డిగ్రీ, జీడీఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, డిప్లమా కోర్సులు చేసిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అన్ని సంస్థల్లోనూ అన్ని కేటగిరీల్లో కలిపి 365 పోస్టులకు ఎంపిక జరుగుతుంది. పోస్టును బట్టి రూ.10,000లు నుంచి రూ.24,000లు వరకు జీతం లభిస్తుంది.

దివ్యాంగుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఏప్రిల్ 13వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 51 సంవత్సరాలు దాటి ఉండరాదని తెలిపారు. అంధులకు (9), బధిరులకు (8), శారీరక వైకల్యం గల వారికి (7) కేటాయించారు. ఈ పోస్టులకు కనీస అర్హతలు తెలియజేసే పూర్తి నోటిఫికేషన్, పోస్టుల వారీగా వివరాలు, సూచనలు, దరఖాస్తు ఫారాలను https@//visakhapatnam.ap.gov.in వెబ్ సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు.

చూసిన కనులదే భాగ్యం

రఘువంశోత్తముడు రామయ్య.. సుగుణాల రాశి సీతమ్మల కల్యాణ మహోత్సవానికి ప్రతి ఊరూ వేదికైంది. ఆకాశాన్నంటుతూ పందిళ్లు కొలువుదీరగా.. ఊరివారంతా పెళ్లిపెద్దలయ్యారు. చూసిన వారికి చూడముచ్చటగా అంగరంగ వైభవంగా సీతారాముల పరిణయ వేడుకను జరిపించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిపించిన ఈ ఉత్సవం చూసిన కనులదే భాగ్యమంటూ భక్తులంతా పరవశించారు. ముత్యాల తలంబ్రాలను అక్షతలుగా స్వీకరించారు. - సాక్షి నెట్‌వర్క్



కశింకోటలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



అనకాపల్లి పెరుగుబజారు రామాలయంలో సీతమ్మ మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకుడు



విశాఖలో అంబికాబాగ్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకస్వామి

వావ్.. వైజాగ్.!

విశాఖలో మూడు రోజుల నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీ 20 సదస్సు ముగింపు దశకు చేరుకుంది. మూడో రోజున పట్టణ మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్ సౌకర్యంపై భాగస్వామ్య దేశాలు వ్యూహ రచన చేశాయి. సదస్సు అనంతరం నగరంలో పలు ప్రాంతాల్లో విదేశీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్, కాపులుప్పాడ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, స్కాడా సిస్టమ్‌లను సందర్శించారు. నగర అందాలకు జీ 20 దేశాల ప్రతినిధులు ముగ్ధులై.. వావ్ వైజాగ్ అని కితాబిచ్చారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యూజీ) సదస్సు గురువారం ముగియగా.. ఆఖరి రోజు శుక్రవారం దేశంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లతో సభ్యదేశాల ప్రతినిధులు సమావేశం కానున్నారు



ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు వద్ద జీ 20 ప్రతినిధులు

- క్షేత్ర పర్యటనలో జీ 20 దేశ ప్రతినిధుల కితాబు
- పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై ప్రశంసలు
- నగర అందాలకు ముగ్ధులైన విదేశీయులు

సాక్షి, విశాఖపట్నం : ఆస్ట్రేలియా, బ్రెజిల్ అధ్యక్షతన విశాఖ వేదికగా మూడు రోజులపాటు నిర్వహించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యూజీ) రెండో దశ సదస్సు ముగిసింది. స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణం కోసం ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయాలనే అంశంపై సభ్యదేశాల ప్రతినిధులు కూలంకషంగా చర్చించారు. నగరాల అభివృద్ధి కోసం నిధుల సమీకరణకు అవలంబించాల్సిన విధానాలపై రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఇప్పటికే పలు దేశాల్లోని నగరాల్లో అనుసరిస్తున్న వ్యూహాలను ఆయా దేశాల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మూడు రోజుల పాటు దాదాపు 8 భిన్నమైన సెషన్లు నిర్వహించారు. నగరాభివృద్ధి, పట్టణాభివృద్ధిలో భాగంగా ఎదురవుతున్న సవాళ్లను ఎలా అధిగమించాలన్న అంశాలపై జీ 20 దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు.

విశాఖ.. ఓ అద్భుతం...

మూడో రోజు సెషన్ ముగిసిన అనంతరం.. జీ 20 దేశాల ప్రతినిధులు నగరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను పరిశీలించారు. కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌తో పాటు.. దేశంలోనే తొలి ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టుగా రికార్డులకెక్కిన ముడసర్లోవ రిజర్వాయర్‌లోని ప్రాజెక్టును సందర్శించారు. అదేవిధంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (వీసీఐసీడీపీ)లో భాగంగా మాధవధారలో స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ పథకం పనితీరుని పరిశీలించారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం కోసం శ్రమిస్తున్నారంటూ అభినందించారు. దీంతో పాటు పెదవాల్తేరులోని మినీ సూయిజ్ ఫామ్-3 (ఎంఎస్ఎఫ్)లో ఉన్న ఎలక్ట్రానిక్ వెహికల్స్‌ను ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ప్రతినిధులు పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టు నగర అభివృద్ధికి చిహ్నంగా ఉన్నాయని, ప్రజలకు అందించాల్సిన మౌలిక వసతులతో పాటు, ప్రజారోగ్యంపై దృష్టి సారిస్తూ వినూత్నంగా ప్రాజెక్టులు నిర్వహించడాన్ని విదేశీ ప్రతినిధులు అభినందించారు. నగర సుందరీకరణ, సాగరతీరంలో అందాలు, వాల్‌పెయింటింగ్స్ చూసి ప్రతినిధులు ముగ్ధులయ్యారు. విశాఖ అందాలకు నెలవంటూ ప్రశంసలు కురిపించారు.

నేడు విశాఖ నుంచి తిరుగుపయనం

మూడు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన జీ 20 సదస్సులో పాల్గొన్న సభ్యదేశాలు, ఆతిథ్య దేశాల ప్రతినిధులు శుక్రవారం విశాఖ నుంచి తిరుగు పయనం కానున్నారు. శుక్రవారం ఉదయం దేశంలో ఎంపిక చేసిన వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లతో సభ్యదేశాల ప్రతినిధులు సమావేశం కానున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెజిలియన్స్ ప్రాజెక్టుల పనితీరు, వాటి ద్వారా ప్రజలకు, నగరాలు పట్టణాలకు కలుగుతున్న ఉపయోగాలపై కమిషనర్లు వివరించనున్నారు. ఈ సదస్సులో పలు యూనివర్సిటీల వీసీలు, ప్రొఫెసర్లు, ఎంపిక చేసిన విద్యార్థులు కూడా హాజరుకానున్నారు. అనంతరం విదేశీ ప్రతినిధులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించనున్నారు. విమానాశ్రయంలో వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. స్వాగతించినప్పుడు ఏ విధంగా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారో వీడ్కోలు కూడా అదే రీతిలో ప్రతినిధులకు చిరాకాలం గుర్తుండిపోయేలా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాట్లు చేశారు.



స్మార్ట్ వాటర్ ప్రాజెక్టు పనితీరు తెలుసుకుంటున్న విదేశీ ప్రతినిధులు

ఆలస్యంగా నడిచిన రైళ్లు

విశాఖ: పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు వద్ద గురువారం తెల్లవారుజామున దురంతో ఎక్స్‌ప్రెస్ బొలెరో వాహనాన్ని ఢీ కొంది. ఈ కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రెండు నుంచి మూడున్నర గంటల ఆలస్యంగా విశాఖపట్నం చేరుకున్నాయి. దురంతో ఎక్స్‌ప్రెస్ లోకో మరమ్మతులకు గురికావడంతో.. మరో లోకోను ఏర్పాటుచేసి విశాఖపట్నం తీసుకొచ్చారు. గురువారం ఉదయం 6.25 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సిన ఈ రైలు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంది. అలాగే నాందేడ్-విశాఖపట్నం (20812) మూడు గంటలు, తిరుపతి-విశాఖపట్నం(22708) డబుల్ డెక్కర్ రెండున్నర గంటలు, బెంగళూరు-భువనేశ్వర్(18464) మూడు గంటలు, పుదుచ్చేరి-భువనేశ్వర్(12897) మూడు గంటలు, కడప-విశాఖపట్నం(17487) రెండున్నర గంటలు, మహబూబ్‌నగర్-విశాఖపట్నం (08586) ఐదున్నర గంటలు, గుంటూరు-రాయగడ (17243) నాలుగు గంటలు, విజయవాడ-విశాఖపట్నం(12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా నడిచాయి.

పలు రైళ్ల రీషెడ్యూల్

- రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా రాయగడలో 4.30 గంటలకు బయలుదేరింది.



విశాఖపట్నం స్టేషన్‌కు ఆలస్యంగా చేరుకున్న రైలు

- విశాఖపట్నం - కోర్బా(18518) ఎక్స్‌ప్రెస్ 1.25 గంటలు ఆలస్యంగా విశాఖపట్నంలో రాత్రి 10.30 గంటలకు బయలుదేరింది.

సికింద్రాబాద్-అగర్తలా మధ్య వన్ వే స్పెషల్

సికింద్రాబాద్-అగర్తలా మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

- సికింద్రాబాద్-అగర్తలా (07018) వన్ వే స్పెషల్ ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మంగళవారం రాత్రి 11.15 గంటలకు అగర్తలా చేరుకుంటుంది. పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు. విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్ స్టేషన్లలో ఆగుతుంది.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

స్కూలుకు బయల్దేరిన బాలిక అనుమానాస్పద రీతిలో మరణించడం సంచలనం రేపింది. రోలుగుంట కేజీబీవీ విద్యార్థిని చిన్నారి (14) వార్డెన్‌కు చెప్పకుండా ఇంటికి వెళ్లిపోయింది. బాలికా విద్యాలయం అధికారులు కొయ్యూరు మండలంలోని తండ్రికి సమాచారం ఇచ్చారు. దాంతో స్కూలుకు వెళతానని బయలుదేరింది కానీ అక్కడికి చేరలేదు. ఆ విషయం తెలియడంతో కంగారు పడ్డ కుటుంబ సభ్యులు వెదకడం ప్రారంభించారు. అంతలోనే గొలుగొండ మండలంలోని బొడ్డేరు గెడ్డలో విగత జీవిగా కనిపించింది. వెంటనే స్పందించిన డీఈవో వెంకటలక్ష్మమ్మ రోలుగుంట కేజీబీవీకి వెళ్లి విచారణ జరిపారు. గొలుగొండ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. 8లో



రోలుగుంట కేజీబీవీలో విచారణ చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

పుష్కలంగా పెద్దేరు..

దరికి రాదు కన్నీరు

మెట్ట భూములకు మహర్దశ



జలాశయంలో పుష్కలంగా సాగునీరు ఉంటుంది. కానీ పంట కాలువలు తుప్పలతో నిండిపోవడం వల్ల శివారు ఆయకట్టు వరకు సాగు నీరందక ఏటా పంట నష్టపోతున్నాము. జలాశయం నిర్మాణం జరిగిన తర్వాత ఒక్కసారే సాగునీరు వచ్చింది. మావన్నీ మెట్ట భూములే. ఎర్రదుంపలు, అపరాలు తప్ప మిగిలిన పంటలు పండవు. అందుకే ప్రతి గ్రామం నుంచి వలస వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇన్నాళ్లకు సీసీ లైనింగ్ మంజూరవ్వడం ఆనందంగా ఉంది.

-కె.అప్పారావు, మట్టవానిపాలెం, రావికమతం మండలం

నీటి కష్టాలకు చెక్



జలాశయం నిర్మాణం జరిగినా సరే ఇన్నాళ్లు నీటి కష్టాలు తప్పలేదు. పంట కాల్వలు సక్రమంగా లేక శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందక ఏటా పంటలు నష్టపోతున్నాము. భూములు ఆయకట్టు ప్రాంతంలో ఉన్నాయి. కాని సాగునీరు అందదు. పెట్టిన పెట్టుబడులు చేతికి రాక ఏటా అప్పులే మిగులుతున్నాయి. మా తాతలు జలాశయం వస్తుందని, రెండు పంటలు పండుతాయని ఆశించారు. కాని వారి హయాంలో సాగునీరు అందలేదు. ఇన్నాళ్లకు పెద్దేరు ఆధునికీకరణకు నిధులు మంజూరవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– యలమంచిలి రమణ, రైతు సత్యవరం



పెద్దేరు జలాశయం

- పెద్దేరు జలాశయం ఆధునికీకరణతో మెట్ట భూములు సస్యశ్యామలం
- రూ.84.40 కోట్లు మంజూరు.. త్వరలో టెండర్లు ఖరారు
- 139 ప్రధాన, డిస్ట్రిబ్యూటర్స్, బ్రాంచి కెనాల్స్‌కు సీసీ లైనింగ్ పనులు
- 19,969 ఎకరాలకు తీరనున్న సాగునీటి సమస్య
- వైఎస్సార్ ఆశయాన్ని నెరవేరుస్తున్న తనయుడు

మాడుగుల: మాడుగుల మండలంతోపాటు ఎర్రవాయి ప్రాంతాలైన రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో మెట్ట భూములు సాగు చేసే రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఈ ప్రాంతాల్లో 80 శాతం మందికి వ్యవసాయమే ప్రధాన వృత్తి. పంటలు పండక, ఊరిలో ఆకలితో ఉండలేక.. పొట్ట చేత బట్టుకొని వలస వెళ్లాల్సిన దుస్థితి. దుఃఖం కమ్ముకొస్తున్నా నమ్ముకున్న భూములను వదిలి వెళుతున్నవారెందరో. వర్షాలు అనుకూలిస్తే తప్ప పంట చేతికి వచ్చే పరిస్థితులు లేవు. ఇలాంటి స్థితిలో సుమారు 20 ఏళ్ల కిందట మాడుగుల మండలం రావిపాలెం వద్ద అత్యంత జలవనరులు గల పెద్దేరు నదిపై రూ.38 కోట్లతో జలాశయం నిర్మాణం చేపట్టారు. పనులు నత్తనడకన సాగుతున్న దశలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పెద్దేరు జలాశయం ఆవశ్యకతను గ్రహించిన ఆయన.. రిజర్వాయర్ పనులు వేగవంతం చేసి 2006లో జాతికి అంకితం చేశారు. రైతుల సూచన మేరకు శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందాలంటే సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలని అప్పట్లోనే అధికారులను ఆదేశించారు. కాని ఆయన అకాల మరణం చెందడంతో ఆ పనులు నేటి వరకు నిలిచిపోయాయి. దీని ఆయకట్టు 19 వేల 969 ఎకరాలు కాగా సగం ప్రాంతానికి మాత్రమే సాగునీరు అందుతుంది.

రూ.84.40 కోట్లతో ఆధునికీకరణ

సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్ చెప్పి వెళ్లిపోయారు. ఆ మాట మళ్లీ తనయుడి పాలనలోనే కార్యరూపం దాలుస్తోంది. జలాశయం ప్రధాన పంట కాలువలు 38.2 కిలోమీటర్లు, 102 డిస్ట్రిబ్యూటర్స్ బ్రాంచి కెనాల్స్‌కు సీసీ లైనింగ్ ఏర్పాటుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.84.40 కోట్లు మంజూరు చేసింది. ఈ సమస్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు పలుమార్లు సీఎంతోపాటు నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఎట్టకేలకు ఈ పనులకు మోక్షం లభించింది. సీసీ లైనింగ్ మంజూరు కావడంతో 20 ఏళ్ల నాటి కల ఫలిస్తోందని ఎర్రవాయి ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



2006లో పెద్దేరు జలాశయాన్ని ప్రారంభిస్తున్న అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు (ఫైల్)



పిచ్చితుప్పలతో రాచకట్టు ప్రధాన పంట కాలువ



పెద్దేరు ఆర్‌ఎంసీ పంట కాలువ

గొటివాడ ఆనకట్ట బ్రాంచి కెనాల్స్‌కు మెరుగు

పెద్దేరు ఆయకట్టులో భాగంగానే గొటివాడ ఆనకట్ట ఎడమ కాలువ పరిధిలో వందలాది ఎకరాల మెట్ట భూములు ఉన్నాయి. కాలువలు పూర్తికాకపోవడంతో ఆనకట్ట పూర్తయిన నాటి నుంచి శివారు ఆయకట్టుకు సాగునీరు అందక పంట పొలాలు పచ్చిక బయళ్లుగా మారిపోయాయి. సీసీ లైనింగ్ ఏర్పాటు చేస్తే సస్యశ్యామలం కానున్నాయి. అలాగే రావికమతం మండలం కొమిర, చినపాచిల బ్రాంచి కెనాల్స్‌కు కూడా నిధులు మంజూరు కావడంతో ఆ ప్రాంత మెట్ట భూములు సాగులోకి వస్తాయని రైతులు ఆనందం చెందుతున్నారు.

టెండరు ఖరారైన వెంటనే పనులు ప్రారంభం

పెద్దేరు జలాశయం ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.84.40 కోట్లు మంజూరు చేసింది. పది రోజుల్లో టెండర్లు పిలుస్తారు. ఖరారైన వెంటనే పనులు ప్రారంభిస్తాము. ఈ పనులు పూర్తయితే పెద్దేరు జలాశయం శివారు ఆయకట్టు వరకు సాగునీరు పుష్కలంగా అందుతుంది.

– వేణుగోపాలనాయుడు, డీఈ, పెద్దేరు జలాశయం

ప్రతి నీటిబొట్టు పంట పొలాలకు చేర్చడమే లక్ష్యం



మాడుగుల నియోజకవర్గంలో అత్యంత జలవనరులున్నాయి. ప్రతి వర్షపు నీటి బొట్టు పంట పొలాలకు చేర్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. తొలుత రూ.84.40 కోట్లతో పెద్దేరు ఆధునీకరణను చేపడుతున్నాం. రానున్నకాలంలో నియోజకవర్గంలో ఉన్న మిగతా జలాశయాలను అంచెలంచెలుగా తీర్చిదిద్దుతాం. ప్రతి నీటి బొట్టు ఒడిసి పట్టి పంట పొలాలకు చేర్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం.

–బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

ఆర్టీసీ బస్సు కిందపడి వృద్ధురాలి మృతి

అడ్డతీగల: మండలంలోని తిమ్మాపురంలో గురువారం ఆర్టీసీ బస్సు కిందపడి అదే గ్రామానికి చెందిన బోర రాఘవమ్మ(82) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. పోలీసులు, గ్రామస్తులు వివరాల ప్రకారం... బోరా రాఘవమ్మ ఏలేశ్వరం వారపు సంతకు వెళ్లడానికి ఇంటి నుంచి బయలుదేరి తిమ్మాపురం కూడలికి వచ్చింది. అదే సమయంలో ఏలేశ్వరం నుంచి వై.రామవరం వైపు వెళ్లే బస్సు అక్కడ ఆగింది. ఈ లోగా ఆమె ఆ బస్సు ముందువైపు నుంచి రోడ్డు దాటుతుండగా, అది గమనించని డ్రైవర్ ముందుకు పోనిచ్చాడు. దీంతో బస్సు ఆమెపై నుంచి వెళ్లిపోయింది. తల భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఇతర శరీర భాగాల వద్ద తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ అప్పలరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల సీహెచ్‌సీకి తరలించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం


యువకుడికి వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి చైతన్య

వై.రామవరం: కొయ్యూరు మండలం యు. చీడిపాలెం పంచాయతీ పి.గంగవరం గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మణ్(28) గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇంట్లో సమస్యలతో మనస్తాపం చెంది ఈ దారుణానికి యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని వెంటనే 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించగా, వైద్యాధికారి చైతన్య వైద్య సేవలందిస్తున్నారు. ఎక్కువ మోతాదులో మందు తాగాడని, 24 గంటల తర్వాతే అతడి ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పగలమని ఆయన తెలిపారు.

5న చలో ఢిల్లీ

మద్దిలపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం పిఠాపురం కాలనీ నుంచి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ ర్యాలీని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మణి ప్రారంభించారు.

కేజీబీవీ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- బొడ్డేరు గెడ్డలో బాలిక మృతదేహం
- బాధిత కుటుంబానికి డీఈవో వెంకటలక్ష్మమ్మ పరామర్శ


విద్యార్థిని కుటుంబాన్ని ఓదార్చిన డీఈవో వెంకటలక్ష్మమ్మ


బొడ్డేరు గెడ్డలో బాలిక మృతదేహం (ఇన్‌సెట్) చిన్నారి(ఫైల్)

నర్సీపట్నం/గొలుగొండ: పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థిని కనిపించకుండా పోయింది. ఒక పక్క కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గొలుగొండ మండలం చోద్యం సమీపన బొడ్డేరు గెడ్డలో శవమై తేలింది. గురువారం వెలుగు చూసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం డి.కొత్తూరుకు చెందిన తుర్రె వీరబాబు కుమార్తె చిన్న అలియాస్ చిన్నారి (14) రోలుగుంట మండలంలో చిన్నాన్న వద్ద పెరుగుతోంది. అక్కడే కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుకుంటోంది. ఈ నెల 27న కేజీబీవీలో ఉపాధ్యాయినులకు చెప్పకుండా తండ్రి వీరబాబు వద్దకు వచ్చేసింది. 28న స్కూల్‌కని చెప్పి తన ఇంటి నుంచి బయలుదేరింది. ఆ రోజు విద్యార్థిని ఇంకా రాలేదని ఆమె చిన్నాన్నకు ప్రత్యేకాధికారి సమాచారమిచ్చారు. దీంతో కంగారు పడిన విద్యార్థిని కుటుంబీకులు ఆమె కోసం వెతకడం మొదలుపెట్టారు. ఇంతలో చోద్యం గ్రామ సమీపాన బొడ్డేరు గెడ్డలో విద్యార్థిని విగతజీవిగా కనిపించింది. స్థానికులు గుర్తించి పరిసర ప్రాంతాలకు సమాచారం అందించారు. ఈ క్రమంలో విద్యార్థిని మేనమామ మరువాడ అర్జున్ అక్కడికి చేరుకుని మృతదేహం తన మేనకోడలిగా గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, కృష్ణదేవిపేట ఇన్‌చార్జి ఎస్ఐ నారాయణరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాధిత కుటుంబాన్ని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం పరామర్శించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని మేనమామ అర్జున్ కోరాడు. గొలుగొండ ఎస్ఐ నారాయణరావు మాట్లాడుతూ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. విద్యార్థిని మృతిపై చాలా కోణాల్లో అనుమానాలు ఉన్నందున లోతుగా విచారణ చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

విద్యార్థిని మృతిపై కేజీబీవీలో డీఈవో విచారణ

రోలుగుంట: స్థానిక కేజీబీవీ విద్యార్థిని తుర్రె చిన్నారి మృతి చెందడంపై డీఈవో, జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు గురువారం విచారణ చేశారు. ఎంఈవో సాయి శైలజ, ఎస్‌వో తులసి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 27న ఆ బాలిక గైర్హాజరైనట్టు హాజరు పట్టీ పరిశీలించి తెలుసుకున్నామని, వెంటనే రోలుగుంట మండలం అడ్డసరంలో బాలిక చిన్నాన్న తుర్రె కల్యాణం, పిన్ని నూకాలమ్మ ఇంటికి వెళ్లి విచారించామని సిబ్బంది, ఎస్‌వో తెలిపారు. ఆ బాలిక తండ్రి వీరబాబుకు ఫోన్ చేయగా, వీడియో కాల్‌లో మాట్లాడించినట్టు డీఈవోకు వివరించారు. 28వ తేదీ ఉదయమే పంపించేస్తామని రాతపూర్వకంగా ఇచ్చారని, 28, 29 తేదీల్లో ఆ బాలిక రాలేదన్నారు. తండ్రి వీరబాబుకు ఫోన్ చేసినా కలవలేదని, చిన్నాన్నకు సమాచారమిచ్చామన్నారు. ఇంతలో చోద్యం సమీపాన చెరువులో చిన్నారి మృతదేహం లభ్యమైనట్టు తెలిసిందని వివరించారు.

బీఎన్‌రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశం


దొండపూడిలో విస్తరణ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం: నర్సీపట్నం–భీమునిపట్నం రోడ్డు విస్తరణ పనులు నిరంతరాయంగా చేపట్టాలని ముందుగా గోతులన్నీ యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. రోలుగుంట మండలం వెలంకాయపాలెం నుంచి బోడవరం మండలం గంధవరం వరకు బీఎన్ రోడ్డు విస్తరణ పనులు కొన్ని నెలలుగా సదరు కాంట్రాక్టర్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడంతో సదరు కాంట్రాక్టర్ గురువారం పనులు ప్రారంభించారు. దొండపూడి వద్ద మార్జిన్ విస్తరణ పనులు చేపట్టారు. ఇకపై నిరంతరాయంగా పనులు చేయాలని ఆదేశించారు. కొత్తకోటలో మిక్సర్ కాంక్రీట్, బీటీ మిక్సర్ మిషనరీ ఏర్పాటు చేస్తున్నామని సూపర్‌వైజర్ ధర్మశ్రీకి వివరించారు. కార్యక్రమంలో దొండపూడి ఉప సర్పంచ్ గ(ట్ర)డ్డి రాజారావు, నాయకుడు రామునాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి కేజీహెచ్ రోగులకు పౌష్టికాహారం

పెంచిన డైట్ చార్జీలు అమలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పోషకాలతో కూడిన ఆహారం అందించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డైట్ చార్జీలను గతంలో ఎన్నడూ లేని విధంగా రెట్టింపు చేసింది. గర్భిణులకు కూడా ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కోసం ఒక్కొక్కరికి రూ.36 చెల్లిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇవే డైట్ చార్జీలు అమలవుతున్నాయి. రోగులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చార్జీలను రూ.80కు పెంచింది. డ్యూటీ డాక్టర్ల కోసం రూ.80 చెల్లిస్తుండగా.. ప్రస్తుతం రూ.100కు పెంచారు. గర్భిణులకు కూడా ఒక్కొక్కరికి రూ.100తో భోజనం అందించనున్నారు. పెంచిన చార్జీలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. కాగా.. కేజీహెచ్‌లో 1200 మంది రోగులు, 56 మంది డ్యూటీ వైద్యులకు రోజూ అల్పాహారం, భోజనం సరఫరా చేస్తున్నారు.

నేడు మన్యం బంద్

సాక్షి, పాడేరు: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేరుస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీతో పాటు పలు గిరిజన సంఘాలు శుక్రవారం మన్యం బంద్ పాటించాలని పిలుపునిచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం అరకులోయలో గిరిజన సంఘం నేతలు బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. ఇంటర్ పరీక్షలతో పాటు 104, 108, ఇతర అంబులెన్స్‌లతో పాటు, పలు అత్యవసర సర్వీసులకు బంద్ నుంచి మినహాయింపు ఇస్తున్నామని ఆదివాసీ జేఏసీ నేతలు, మావోయిస్టులు ప్రకటించారు.

బంద్‌కు ప్రభుత్వ అనుమతి లేదు: ఎస్పీ సతీష్‌కుమార్

మన్యం బంద్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ, ప్రైవేట్ రవాణా వ్యవస్థతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు పనిచేస్తాయన్నారు. బంద్‌తో ఎక్కడైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటామని, అన్ని మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్‌లలో భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ తెలిపారు.

యథావిధిగా పాఠశాలలు తెరవాలి: డీఈవో సలీమ్ బాషా

జిల్లాలోని ప్రభుత్వానికి చెందిన అన్ని యాజమాన్య పాఠశాలలను శుక్రవారం యథావిధిగా తెరవాలని డీఈవో సలీమ్ బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలను తెరవడంతో పాటు, పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట పనివారంతా పాఠశాలలకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు ఇచ్చారని ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దు

ఆర్టీసీ పలు బస్సు సర్వీసులను శుక్రవారం రద్దు చేసింది. విశాఖ,నర్సీపట్నం,ఎస్.కోట డిపోల నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు నడిచే సర్వీసులను నిలిపివేయనున్నారు. పాడేరు డిపోకు సంబంధించి అరకులోయ,ముంచంగిపుట్టు,చింతపల్లి రూట్‌లలోని పలు నైట్‌హాల్ట్ సర్వీసులను వెనక్కి రప్పించారు. డొంకరాయి ఎక్స్‌ప్రెస్ సర్వీసును సీలేరు పోలీసు స్టేషన్‌లోను, కొయ్యూరు మండలం మంప బస్సును కొయ్యూరు పోలీసుస్టేషన్‌లో నిలిపివేస్తున్నట్టు డిపో మేనేజర్ సీతారామ్‌నాయుడు తెలిపారు. రంపచోడవరం బస్సును పూర్తిగా రద్దు చేశామన్నారు. రాజమండ్రి, కాకినాడ డిపోలకు చెందిన పలు బస్ సర్వీసులను పరిస్థితిని బట్టి మారేడుమిల్లి,చింతూరు,భద్రాచలం ప్రాంతాలకు నడుపుతామని,వీలుకాని పక్షంలో రద్దు చేస్తామని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.అరకులోయ మీదుగా ఒడిశాలోని ఒనకఢిల్లీ,జైపూర్ అంతరాష్ట్ర సర్వీసులను కూడా రద్దు చేశారు.

ఏపీ ఎకనామిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పరమేశ్వరరావు



ఎంవీపీ కాలనీ: ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఆచార్య కొండపల్లి పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడైన ఆయన ఏయూ దూరవిద్యా కేంద్రం ఎకనామిక్స్ విభాగం ద్వారా విద్యార్థులకు దశాబ్దాలపాటు విశిష్ట సేవలు అందించారు. ఇటీవల తిరుపతి వేదికగా జరిగిన 39వ ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆచార్య పరమేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఆచార్య పరమేశ్వరరావు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడంతో పాటు ప్రస్తుతం పర్యావరణం, ఆర్థిక అంశాలకు సంబంధించి పలు పత్రికల్లో సంపాదకీయాలు రాస్తున్నారు. మానవత సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు

తుమ్మపాల : విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగుల)కు ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల నుంచి 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధికారి జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన విభిన్న ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అంధులకు 9, బధిరులకు 8, శారీరక వైకల్యం కేటగిరీలో 7 ఖాళీలున్నట్లు వెల్లడించారు. జూలై 1, 2023 నాటికి 18 ఏళ్లు దాటి, 52 ఏళ్లలోపు వయసున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 13 తుది గడువుగా పేర్కొన్నారు. పోస్టుల వారీగా కనీస అర్హతలు, పూర్తి నోటిఫికేషన్ వివరాలకు visakhapatnam.ap.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. దరఖాస్తు ఫారంను కూడా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తును సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, రాణి చంద్రమతీదేవి ఆస్పత్రి, పెదవాల్తేరు జంక్షన్, విశాఖపట్నం–530017 చిరునామాకు ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రంలోగా స్వయంగా గాని, పోస్టు ద్వారా కానీ అందజేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 35వ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, ప్రధాన కార్యదర్శి నవర మోదకొండబాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బ్యాటింగ్ చేయగా రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు బౌలింగ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు అందించడం వల్ల గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు.

రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, ఉత్సవ కమిటీ ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు, నిర్వాహకులు కొంటా దుర్గారావు, తాంగుల మహేష్, అగతంబిడి రాజారావు నరేష్, సతీష్ పాల్గొన్నారు.

సుందరం..సుమధురం

- వైభవంగా శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి కల్యాణం
- రామనామస్మరణతో మార్మోగిన శ్రీరామగిరి


కల్యాణం క్రతువు జరిపిస్తున్న అర్చకుడు

వీఆర్‌పురం: ఏజెన్సీ భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన శ్రీరామగిరి శ్రీసుందర సీతారామచంద్ర స్వామివారి కల్యాణం అశేష భక్తుల రామనామస్మరణ మధ్య గురువారం వైభవంగా జరిగింది. పుణ్య గోదావరి,పవిత్ర శబరి నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో మాతంగ మహర్షి నిర్మించిన ఆలయంలో నిర్వహించిన ఈ ఉత్సవాన్ని భక్తులు తనివితీరా వీక్షించి భక్తిపారవశ్యంతో ఉప్పొంగిపోయారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు కల్యాణ వేడుకలో భాగంగా కొండమీద ఆలయంలో బుధవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. గురువారం వేకువజాము నుంచి కల్యాణ ఘట్టాలను క్రమపద్ధతిలో చేపట్టారు. సంకల్పం, యజ్ఞోపవీతం ,జీలకర్ర బెల్లం,మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం జరిగింది.

క్లుప్తంగా

గౌరీ పీఏసీఎస్ బడ్జెట్ సమావేశం నేడు

అనకాపల్లిటౌన్ : గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ గవరపాలెం వి.వి.రమణ సహకార భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్నట్లు సంఘం చైర్మన్ కాండ్రేగుల కృష్ణఅప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ 2022–23 పరిపాలన నివేదిక వివరాలు, 2023–24 బడ్జెట్ అంచనాలపై చర్చ జరుగుతుందన్నారు. సంఘ సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు, టమాటా, బంగాళాదుంపలు రూ.20, వంకాయ, క్యాబేజి రూ.30, క్యారెట్, బీట్‌రూట్ రూ.40, బెండకాయ, దొండకాయ, చిక్కుడు రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

ఉచిత వైద్యశిబిరం


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనకాపల్లిటౌన్ : స్వర్గీయ మళ్ల భువనేశ్వరావు జయంతిని పురస్కరించుకుని విశాఖ ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన వైద్య సిబ్బందిచే స్థానిక కాశీబాబా ఆలయం వద్ద గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

బియ్యం గింజలపై రామనామం


శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నాగులాపల్లి సీతారాముల ఆలయంలో కర్రి యశోద దంపతులు బియ్యం గింజలపై శ్రీరామ నామం రాశారు. వేలాది బియ్యం గింజలపై శ్రీరామ నామం రాసి, వాటిని తలంబ్రాలుగా సీతారామ కల్యాణంలో వినియోగించాల్సిందిగా ఆలయానికి సమర్పించారు.

– మునగపాక

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 3,821 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,210	4,310
మొదటి రకం	3,860	4,250
రెండో రకం	3,500	4,020
మూడో రకం	3,090	3,410

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 87 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-40 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 201 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 194 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

అంతా రామమయం.. ప్రతి ఊరూ అయోధ్యా నిలయమే. రాముడంటే కేవలం దేవుడు మాత్రమే కాదు. అందుకు భారతీయుల మనసులు అంగీకరించవు. మర్యాదా పురుషోత్తముడు మన జీవన విధానం. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా ఊరూరా సీతారాములు కల్యాణ దంపతులుగా కొలువయ్యారు. ప్రతి ఆలయం, పందిరిలోనూ శ్రీరామ చరితం.. శ్రవణానందభరితంగా సాగింది. రామకథ.. పండితుల్లో తమ జీవన విధానంపై పునరాలోచన రేకెత్తిస్తే.. పామరుల్లో 'మా రాముని కష్టం లోకంలో ఎవరూ పడలేదయ్యా..!' అంటూ ఆశ్చర్యం, ఆవేదనతో కూడిన కన్నీళ్లు పెట్టించింది.


పెదరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణంలో రత్నాకర్, అచ్యుత దంపతులు


వేల్పులవీధి అన్నసమారాధనలో కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు


పెరుగుబజారు ఉత్సవవిగ్రహాలను ఊరేగిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొణతాల జగన్


చినబోయగూడెం రామాలయంలో కల్యాణ వేడుకల్లో దంపతులు


గాంధీనగరం రామాలయంలో కల్యాణ వేడుకల్లో దంపతులు


కల్యాణాన్ని భక్తి పారవశ్యంతో తిలకిస్తున్న భక్తజనం

- అత్యంత వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఊరూవాడా సీతారాముల కల్యాణోత్సవాలు
- రామ నామ స్మరణతో మార్మోగిన గ్రామాలు

అనకాపల్లి టౌన్ : రామనామ స్మరణం.. సర్వపాప హరణం. శ్రీరామ నవమి వేడుకలు గ్రామాల్లోని రామాలయాల్లో కన్నులపండువగా జరిగాయి. తొలి వేకువ నుంచే భక్తులు స్వామి దర్శనానికి ఆలయాల ముందు బారులు తీరారు. ఖండ భజనలు, కోలాటాలు, రామనామ సంకీర్తనలతో గ్రామాలు హోరెత్తాయి. మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తంలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

- స్థానిక గవరపాలెం పెదరామస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, అచ్యుత దంపతుల చేతులమీదుగా సీతారాముల కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి.
- పూడిమడక రహదారిలో గణేష్, షిర్డీసాయి సహిత రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. అంతకు ముందు స్వామివారిని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు దర్శించుకున్నారు. విజయరామరాజుపేట రామాలయంలో సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది.
- నెయ్యిలవీధి రామాలయంలో స్వామివారి కల్యాణ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ఈ వేడుకల్లో 8 మంది దంపతులు హాజరై స్వామివారి కల్యాణం జరిపారు. స్వామివారిని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అన్నమాచార్య వాగ్గేయవరదాయిని బృందం సంకీర్తనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.
- 80వ వార్డు పరిధి చినబోయగూడెం విఘ్నేశ్వర కోదండరామ సర్వలక్ష్మి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.
- వేల్పులవీధి సీతారామాలయంలో ఉత్సవ విగ్రహాలను భక్తులు పల్లకిలో పురవీధులగుండా ఊరేగించారు. కల్యాణమూర్తులను 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు దర్శించుకున్నారు.
- పెరుగుబజారు రామాలయంలో సిరసపల్లి రమణ, గంటాలమ్మ దంపతుల చేతుల మీదుగా సీతారాముల కల్యాణ వేడుకలు జరిగాయి. ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు. తిరుమల తిరుపతి నుంచి తీసుకొచ్చిన ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. తొలుత సీతారాముల విగ్రహాలకు పండితుల వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించారు.
- గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో మళ్ల సాంబశివరావు, వెంకటరత్నం దంపతులు సీతారాముల కల్యాణం నిర్వహించారు.
- న్యూకాలనీలో అష్టాదశ శక్తిపీఠాల ఆలయంలో బి.శ్రీనివాసరావు దంపతుల చేతుల మీదుగా కల్యాణ వేడుక జరిగింది.
- గాంధీనగరం, లక్ష్మీదేవిపేట, మళ్లవీధి, కోట్నివీధి రామాలయాలతోపాటు నర్సింగరావుపేట షిర్డీసాయిబాబా ఆలయం ఆవరణలో సీతారాముల కల్యాణ వేడుకలను భక్తులు తిలకించారు.
- విలీన గ్రామమైన కొత్తూరు నర్సింగరావుపేట రామాలయంలో కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.
- రాజుపాలెం, సిరసపల్లి గ్రామాలతోపాటు తారక రామారావుకాలనీ, రేబాక, సీహెచ్ఎన్ అగ్రహారం, గోపాలపురం, మార్టూరు, కోడూరు గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు.

కశింకోట : మండల గ్రామాల్లో గురువారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. సీతారాముల కల్యాణోత్సవాలు, అన్న సమారాధనలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

- గవరపేట శారదా గణపతి రామాలయంలో భారీ స్థాయిలో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను, పల్లకిపై సంప్రదాయ సారెతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. భిలాయ్‌కి చెందిన గరుడాచలం అభిషేక్, సత్య మాధురి దంపతుల చేతుల మీదుగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిగింది.
- స్థానిక కస్పావీధిలోని సత్యసాయి భజన మండలి బృందం, గొబ్బూరు గ్రామానికి చెందిన బృందాలతో వేర్వేరుగా కోలాటాలు ప్రదర్శించారు. మునగపాక మండలం అరబుపాలెం, పాటిపల్లి గ్రామాలకు చెందిన బృందంతో చిటికెన భజనలు ప్రదర్శించారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, అధ్యక్షుడు భీశెట్టి కల్యాణ చక్రవర్తిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.
- స్థానిక పూసర్ల వీధిలోని రామాలయంలో యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి దంపతులు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగాజరిపించారు. వీరిని స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్దనున్న వారి ఇంటి నుంచి తోడపెద్దు సేవ, కోలాటాలు, తప్పెటగుళ్లతో కల్యాణ వేదిక వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు.
- కస్పావీధి రామాలయంలోనూ పెద్ద ఎత్తున సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించి అన్న సమారాధన చేశారు.
- కనకమహాలక్ష్మి వీధిలోని రామాలయంలో పురోహితుడు నెరసావర్జుల శర్మ శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని జరిపించారు.
- జాతీయ రహదారి వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు.
- కోదండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో పేరి శర్మ, వీణ దంపతులు సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు.
- అగ్రహారంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని జరిపించి ప్రసాద వితరణ చేశారు.
- ఉగ్గినపాలెం రామాలయంలో ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు దంపతులు, గానుగుల సురేష్, లక్కరాజు గోవింద, చెక్క గోవింద, ద్వారపురెడ్డి సోమేష్ దంపతులు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. అన్న సమారాధన నిర్వహించారు.
- బయ్యవరంలోని రెండు రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించారు. అన్న సమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ జయ దంపతులు, పాల్గొన్నారు.
- నరసింగబిల్లి రామాలయంలో బండి శ్రీను దంపతులు సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
- చెరకు కాటా వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించి పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.
- కన్నూరుపాలెం రామాలయంలో సీతారాముల కల్యాణం జరిపించి భారీ అన్న సమారాధన నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్.శివ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
- తాళ్లపాలెం రామాలయం, బంగారయ్యపేట, జి.భీమవరం, లాలంకొత్తూరు, అచ్చెర్ల, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జమాదులపాలెం, పరవాడపాలెం, ఏఎస్ పేట, సోమవరం, నూతలగుంటపాలెం, తేగాడ, కొత్తపల్లి, వెదురుపర్తి, జోగారావుపేట తదితర గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు, అన్న సమారాధనలు ఘనంగా నిర్వహించారు.

పూడిమడక కల్యాణోత్సవంలో మంత్రి అమర్‌నాథ్


మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్ : స్థానిక పూడిమడక రహదారి గణేష్ షిర్డీసాయి సహిత రామాలయంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మళ్ల జగన్, కార్యదర్శి బొడ్డేడ దేవయ్య, కోశాధికారి యల్లపు కృష్ణసంతోష్‌లు మంత్రి అమర్‌నాథ్‌కు స్వామివారి మొమెంటో అందించి, శాలువతో సత్కరించారు.

రాములవారి పెళ్లికి ఊరంతా సందడి

అనకాపల్లి రూరల్: శ్రీ రామనవమి వేడుకలను పురస్కరించుకుని కొత్తూరు అభయాంజనేయ స్వామి ఆలయం, శారదానగర్ పురాతన ఆంజనేయస్వామి ఆలయం, తుమ్మపాల, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, రామాపురం, కృష్టాపురం, కూండ్రం, సీతయ్యపేట తదితర గ్రామాల్లో రామాలయాల వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. జానకి రాముల పరిణయ ఘట్టాలను భక్తులు నేత్రానందంగా వీక్షించారు. అన్నసంతర్పణలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి కొన్నిచోట్ల సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. శ్రీరామనవమి సందర్భంగా పలుచోట్ల ఆలయాలు విద్యుద్దీపాలతో కాంతులీనాయి.


కొత్తూరులో సీతారామ కల్యాణం


కోలాటమాడుతున్న భక్తులు


బోనాలతో కోలాటాలు ప్రదర్శిస్తున్న గొబ్బూరుకు చెందిన మహిళా బృందం


కశింకోటలో కోలాటాలు ప్రదర్శిస్తున్న సత్య సాయి భజన మండలి బృందం


కశింకోటలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం


గవరపేటలో సీతారాముల కల్యాణోత్సవంలో తలంబ్రాల ఘట్టం

ఒకే టికెట్ కౌంటర్‌తో ప్రయాణికుల ఇక్కట్లు

- కోవిడ్ సమయంలో మూసేసిన అదనపు కౌంటర్
- గూడ్స్‌షెడ్ టికెట్ కౌంటర్ తెరవాలని ప్రయాణికుల విజ్ఞప్తులు


నిరుపయోగంగా ఉన్న గూడ్స్‌షెడ్ టిక్కెట్ల బుకింగ్ కౌంటర్

అనకాపల్లిటౌన్ : ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన అనకాపల్లిలో రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. దక్షిణ మధ్య రైల్వేజోన్ విజయవాడ డివిజన్ పరిధిలో చిట్టచివరి ప్రధాన రైల్వే స్టేషన్ ఇదే. గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రయాణికులు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నప్పటికీ సౌకర్యాల కల్పనలో రైల్వే అధికారులు విఫలమయ్యారనే ఆక్షేపణలున్నాయి. టికెట్ బుకింగ్ కౌంటర్ ఒక్కటే ఉండటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పట్లేదు.

నిరుపయోగంగా గూడ్స్ షెడ్ కౌంటర్

ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం, రైల్వే క్వార్టర్స్‌కి సమీపంలో బుకింగ్ కౌంటర్ వద్ద రైల్వే అధికారులు టికెట్ల కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు అక్కడ నుంచి టికెట్లు తీసుకుని 2, 3 ప్లాట్‌ఫారాలకు చేరుకోవాలంటే ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించి రైల్వే అధికారులు గూడ్స్‌షెడ్ వద్ద టిక్కెట్ల బుకింగ్ కౌంటర్ ప్రారంభించారు. దీంతో రెండు కౌంటర్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండేవి. కోవిడ్ మహమ్మారి కారణంగా గూడ్స్‌షెడ్ వద్ద ఉన్న టిక్కెట్ల బుకింగ్ కౌంటర్ మూతపడింది. గత రెండేళ్లుగా ఇది నిరుపయోగంగానే ఉంది. ఒకటో ప్లాట్‌ఫారం మీదికొచ్చే రైళ్లను ఎక్కే ప్రయాణికులకు పెద్దగా ఇబ్బందుల్లేవు. రెండు, మూడు ప్లాట్‌ఫారాల నుంచి వెళ్లే ప్రయాణికులకు మాత్రం ఇక్కట్లు తప్పట్లేదు. గూడ్స్‌షెడ్ కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉరుకులు పరుగులు తప్పట్లేదు



గూడ్స్‌షెడ్ వద్దనున్న టికెట్ల బుకింగ్ కౌంటర్ ఉండేటపుడు ఇన్ని తిప్పలుండేవి కావు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం పక్కనున్న టిక్కెట్ల బుకింగ్ కౌంటర్‌లో టిక్కెట్ తీసుకొని రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు చేరుకోవాలంటే ఎంతో సమయం పడుతోంది. ఈలోగా మేమెళ్లాల్సిన రైలు ప్లాట్‌ఫాంపై ఉందో, లేదో తెలియక ఆందోళనతో ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తోంది.

– ఎస్.లక్ష్మి, ప్రయాణికురాలు, అనకాపల్లి

టికెట్ కౌంటర్ల వద్ద ప్రయాస



అనకాపల్లి–విశాఖ చేరుకునేందుకు అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండు, మూడు ప్లాట్‌ఫారాలపైనే ఆగుతాయి. స్టేషన్‌లో ఒకే టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌తో అవస్థలు పడుతున్నాం. క్యూ లైన్లో చాలా సమయం నిల్చుని, టికెట్ తీసుకోవాల్సి వస్తోంది. చాలా సమయం వృథా అవుతోంది. నిరుపయోగంగా మారిన గూడ్స్ షెడ్ బుకింగ్ కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎస్.అప్పారావు, ప్రయాణికుడు, కశింకోట

ఉన్నతాధికారులకు నివేదించాం

కరోనా సమయంలో పై అధికారుల ఆదేశాల మేరకు గూడ్స్ షెడ్ వద్ద టికెట్స్ బుకింగ్ కౌంటర్‌ను మూసేశాం. రోజుకు టికెట్స్ ద్వారా స్టేషన్‌కు సుమారుగా రూ.2 లక్షల ఆదాయం వస్తుంది. కౌంటర్ల వద్ద ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. గూడ్స్‌షెడ్ కౌంటర్ తెరిచేందుకు విజయవాడ డివిజన్ అధికారులకు నివేదించాం. అనుమతి వచ్చాక ఆ కౌంటర్‌ను ప్రారంభిస్తాం.

– బి.వెంకటేశ్వరరావు, స్టేషన్ మేనేజర్, అనకాపల్లి

మళ్లను పరామర్శించిన మంత్రి గుడివాడ


సత్యనారాయణతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన సీపీఎం నాయకుడు మళ్ల సత్యనారాయణను ఆయన స్వగృహంలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మంత్రి వెంట ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నేతలు భోగలింగేశ్వరరావు, బొడ్డేడ శివకృష్ణ, మళ్ల స్వామి, గొన్నాబత్తుల వెంకటరమణ, గైపూరి రాజు, మునూరు శ్రీనివాస్ ఉన్నారు.

వెంకన్న సన్నిధిలో సీతారాముల కల్యాణం


ఉపమాకలో సీతారాముల కల్యాణ వేడుక

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యాభిషేకాలు, అర్చనలు పూర్తిచేశారు. తర్వాత కొండమెట్ల వద్ద గల సీతారామస్వామివారి ఆలయంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకుముందు వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుందరకాండ పారాయణం జరిగింది. అనంతరం ప్రసాద వినియోగం తీర్థగోష్ఠి నిర్వహించారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం శివార్లలో గురువారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో వీరి నుంచి 5 కోడి పుంజులతో పాటు రూ.1,020 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ


త్రైత సిద్ధాంత క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ నరసింగరావు

అనకాపల్లిటౌన్ : త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను రూరల్ ఎస్ఐ నరసింగరావు, అగ్నిమాపక అధికారి లక్ష్మయ్యలు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి

మునగపాక : మండలంలోని కాకరాపల్లి నుంచి నారాయుడుపాలెం వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం అనకాపల్లి, మునగపాక, పరవాడకు వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో తుప్పలు ఎత్తుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట ప్రయాణించేవారు భయాందోళనకు గురవుతున్నారు. కనుచూపు మేరలో ఏముందో తెలుసుకునే అవకాశం లేక భయంభయంగా ఈ రోడ్డుపై ప్రయాణించాల్సి వస్తోందని చెప్తున్నారు. అధికారులు స్పందించి తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

అనకాపల్లిటౌన్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న అమరపల్లి నూక అప్పారావును అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ మేరకు అప్పారావు నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.